# ధర్మం శరణం గచ్ఛామి

**వెం**కటేశ్వరన్ హైదరాబాద్‌కు వచ్చి దాదాపు 55సం॥లు అయి ఉంటుంది. ఆయన జన్మ స్థలం ఎక్కడ అని అడిగితే మామూలుగా మద్రాసుఅనే చెప్తాడు. అయితే, ఆ పృచ్ఛకుడుతమిళనాడుకు చెందిన వాడయితే సరయిన పేరే - అంటే 'కుంభకోణం' అని చెప్తాడు. కానీ ఆ పృచ్ఛకులు తమిళనాడు వాళ్ళు కానట్లయితే వారితో కుంభకోణ్ అని చెప్పినపుడు వారిముఖం మీద మెరిసిన ఒక ప్రత్యేకమైన చిన్న నవ్వు చూడగానే వెంకటేశ్వరన్ ఒళ్ళు సలసల కాగుతుంది. అందుకే, తనస్వస్థలం గురించి సరయిన జవాబు చెప్పడు.

కుంభకోణానికి మోసం, ఫోర్ట్వంటీ, మాయ, మర్మం లాంటి దుష్టార్థాలు ఎలాసంక్రమించాయో ఆయనకే తెలియదు. సత్యం, సదాచారం, ధర్మం, నీతి ఉన్న కుటుంబంలో ఆయన జన్మించాడు. ఆయన గురించి వ్యక్తిగతంగా తెలిసిన వాళ్ళకు ఆయనమీద చాలా గౌరవం ఉంది. అంత నిజాయితీ పరుడైన వ్యక్తిని ఈ కాలంలో చూడగలగడం కూడ చాల అరుదు అని చాలామంది అనుకుంటారు.

దాదాపు ముప్ఫయ్యేడు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ అక్కౌంటెంట్ జనరల్ ఆఫీసులో పనిచేసి పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరన్‌ను ఇప్పటికీ ఆఫీసులో వాళ్ళందరు చాలా అభిమానంతో గుర్తుచేసుకుంటుంటారు. తన ఇరవయ్యొకటో యేట ఒక గుమాస్తాగా ఉద్యోగంలో చేరిన ఆయన డిప్యూటీ ఎ.జి.గా. రిటైరయ్యాడు గాని వారికి మిగిలిన స్థిరాస్తి అని చెప్పుకోడానికి ఆనంద్ నగర్‌లో ఉన్న ఒక ఇల్లు, వెంట్రామన్ అనే ఒకే ఒక కొడుకు మాత్రమే.

ఉద్యోగంలో ఉన్నంతకాలం బాగా సంపాదించడానికి అవకాశాలు ఉన్నా కూడా న్యాయ రహితంగా ఆయన ఎప్పుడూ ఒక పైసా కూడ తీసుకోలేదు.

పైగా వచ్చిన జీతం రాళ్ళలోనే కొంచెం పాటి దాన ధర్మాలకు, పూజా పునస్కారాలకు ఖర్చు పెట్టడం వల్ల బాంకులో బాలన్సు ఎప్పుడూ ఉండేది కాదు. ఆ తండ్రి జెరాక్స్ కాపీయే వెంకట్రామన్. మామూలు యువకుల కున్న బలహీనత లేవీ వెంకట్రామన్‌కు అంటుకోలేదు. తన తండ్రి అడుగు జాడల్లోనే నడుస్తున్న ఆ కుర్రవాడు జీవితంలో ఒక్కసారి కూడ మాంసాహారం భుజించడం గాని, ఒక్క సిగిరెట్‌ను కాల్చడంగాని చెయ్యలేదు. వెంకటేశ్వరన్‌కు పాన్ తినే అలవాటయినా ఉందిగాని వెంకట్రామన్‌కు అది కూడ లేదు. చదువులో అంత గొప్పవాడు కాకపోయినా ఏ క్లాసులో కూడ రెండు సంవత్సరాలు అతను కూర్చో లేదు. ఏ రకమయిన కంప్లయింట్‌కు అవకాశమియ్యకుండా చదివి సెకండ్ క్లాస్‌లో బి.కాం పాసయ్యాడు. తరవాత యం.కాం. కుగానీ, యం.బి.ఏ కి గానీ సీట్ దొరకడం కష్టమవడం వల్ల అతను గవర్నమెంటులో ఒక గుమాస్తా పదవిని స్వీకరించాడు.

కానీ ప్రతిమనిషికీ ఏదో ఒక దౌర్బల్యమో, అలవాటో లేక దురలవాటో ఉండాలికదా! వెంకట్రామన్‌కు కూడ ఒక చిన్న బలహీనత ఉండేది. స్కూల్లో చదువుతున్నప్పుడు ఇంట్లో ఎవరికీ తెలియకుండ సెలవు రోజుల్లో రహస్యంగా సినిమాకు వెళ్ళే వాడు. కాలేజీకి వచ్చాక ప్రతివారం కనీసం ఒక సినిమా చూడడం మొదలు పెట్టాడు. ఏ భాషలోని సినిమా అయినా చూస్తాడు. కానీ తెలుగు చిత్రాల మీద మాత్రం ఆయనకు కొంచెం మక్కువ ఎక్కువ.

ఉద్యోగంలో ప్రవేశించి రెండు సంవత్సరాలయ్యాక, తల్లితండ్రుల ఇష్ట ప్రకారంగానే ఆయునకు వివాహం జరిగింది. అప్పుడాయునకు వయుస్సు ఇరవైమూడే. అంత చిన్నవయస్సులో వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోయినా పితృమిత్రుడైన సుబ్రమణ్యం మామ ఏకైక సంతానం అయిన పందొమ్మిదేళ్ళ సుకుమారి కామాక్షిని ముందే చూచి, అతికాంక్ష ఉండడం వల్ల అతనికి అసమ్మతి తెల్పడానికి సాధ్యం కాలేదు. లేకపోయినా, తండ్రికి ఏ విషయంలోనూ 'నో' అని చెప్పడానికి ఆయనికి ధైర్యం ఉండేదికాదు. పైగా కామాక్షీ అతనికి 'రోమాంచం' కావడం వల్ల ఆమె అతనికి జీవిత సఖి అయినప్పట్నుంచీ అతని రోమాలకు రెస్ట్ దొరకనే లేదు.

కామాక్షి ఒక కలర్ టివీ తనతో తీసుకొని రావడం వల్ల నెలలో కనీసం ఎనిమిది, పది సినిమాలు చూడగలగడం దైవానుగ్రహంగా వెంకట్రామన్ భావించాడు. అంతేకాక.

ఆఫీసుకు సౌకర్యంగా పోయిరావడానికి, తనవధువును అప్పుడప్పుడూ షికారు తీసుకొని వెళ్ళడానికి సుఖంగా ఉన్న ఒక కొత్త స్కూటర్‌ను పెళ్ళికానుకగాగాని, వధువుకట్నంగాగాని ( ఏది అనుకున్నా సరే) సుబ్రమణ్యం ఇచ్చినపుడు అతనికి అభ్యంతరం చెప్పే శక్తి లేక పోయింది.

కామాక్షి బి.ఎ. సెకండియర్ విద్యార్థికావడం వల్ల ఆమెను వెనక కూర్చోబెట్టుకుని ఎక్కువగా తిరగడానికి తండ్రి నుంచి అనుమతి లభించేదికాదు. ఆమె కాలేజీకి బస్సులోనే వెళ్ళి వచ్చేది. అజీర్ణం ఎక్కువగా ఉన్నట్టున్న పొట్టతో కాలేజీకి పోవడం ఇష్టం లేనందువల్ల పెళ్ళయిన మొదటి పదిహేను నెలల వరకు ఆనవదంపతులు కుటుంబ నియంత్రణ పద్ధతుల్ని అవలంభించక తప్పలేదు. కానీ, ఆమె బి.ఎ రిజల్టు వచ్చిన ఆరునెలల లోపలే అంటే నవంబరు నెలలోనే ఇంకో రిజల్టు కూడ వచ్చింది...ఒక బుజ్జి కామాక్షి.

మొదటి సంతానం ఆడపిల్ల కావడం ఆ రెండు కుటుంబాలకు ఎలాంటి దుఃఖం కలగలేదు. ప్రథమంగా లక్ష్మి అవతరించడం అదృష్టంగానే అనుకున్నారు. కానీ రెండు సం॥ల తర్వాత ఇంకో లక్ష్మి ఏడుస్తూ ప్రత్యక్షమయినప్పుడు కూడ ఎవరికీ ప్రసన్నత కలగలేదు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన తరవాత కామాక్షి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సను చేయించుకోవాలని వారి అభ్యుదయ కాంక్షులయిన చాలామంది సలహా ఇచ్చారు. కానీ, కామాక్షికి ఏ పరిస్థితుల్లో నయినా ఒక బాల వెంకట్రామన్ కావాలన్న తీవ్రమైన కోరిక ఉండడం వల్ల; ఒకటి తప్పితే మూడోది అవుతుందన్న ఒక సామెత ఉండడం వల్ల, సుబ్రమణ్యం స్నేహితుడు పళని స్వామి అనే జ్యోతిష్య చక్రవర్తి శుభ ప్రవచనం వల్ల ఇంకో పదిహేను నెలల్లో కామాక్షమ్మ మళ్ళీ ప్రసవించింది. కానీ పళని ప్రవచనాన్ని ఛాలెంజ్ చేస్తూ పెద్దగా అరిచిన నవజాత శిశువుకు పురుష జాతక లక్షణాలు ఉన్నా, లేకున్నా పురుష లక్షణం తెలిపే ప్రత్యేకత లేకపోయింది.

కామాక్షి అక్షుల నుంచి సంతాన లాభం వల్ల సంతోషాశ్రువులకు బదులుగా సంతాపాశ్రుధార స్రవించింది. పళని స్వామి 'లొడ లొడ' నాలుకను కత్తిరించి అతన్ని ఒక మూగస్వామిని చేయాలన్నంత కోపం వెంకట్రామన్‌కు వచ్చింది. ఎంత ఆలస్యం జరిగినా అతను ఒక ధృఢ నిశ్చయం చేసుకున్నాడు-ఎవరేం చెప్పినా కామాక్షి గర్భ నిరోధక శస్త్ర క్రియకు ఇంక విలంబం చేయరాదని. వెంటనే అది జరిగింది కూడా.

పంథొమ్మిది వందల డైబ్బయి ఒకటో సంవత్సరంలో పి.ఎ.ఓ. ఆఫీసులో చేరిన వెంకట్రామన్‌కు ఇప్పుడు యాభై సంవత్సరాలు. ఇప్పుడు అతను అసిస్టెంట్ పే అండ్

అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ లోపల కాలం అతన్ని ఒక నిర్జీవమైన దిష్టిబొమ్మలాగా మార్చింది. అతని పెద్దకూతురు మహాలక్ష్మి ఇంగ్లీషు భాషలో యం.ఏ పాసయ్యాక గతమూడు సంవత్సరాల నుంచీ వివాహ సంబంధాలు అనే ఐచ్ఛిక విషయంలో పి.హెచ్.డి. చేస్తోంది. చూడడానికి ఆమె చాలా అందగత్తె, సంగీతంలో పాకకళలో ప్రవీణురాలు, సుశీల కూడా. కనీసం ఒక పదిహేను పెళ్ళి చూపులైే ఉంటాయి. పెళ్ళివారి కనీసకోరిక యాభైవేల రూపాయల కట్నం. ఇప్పుడు పెళ్ళి చూపులకు ఎవరయినా వస్తున్నారంటేనే ఆమెకు వాంతి వచ్చినట్లుంటుంది. ఆమె తాతకిప్పుడుడెబ్బయి ఆరేళ్ళ వయస్సు. అయినా ఆయనే ఆ ఇంటికి యజమాని. ఆయన కట్నానికి విరోధి. వెంకటేశ్వరన్ తన కొడుకతో ''నాయనా! పిల్లల వివాహం గురించి ఆలోచించి నీ మనసు కష్టపెట్టుకో వద్దు. మన ముగ్గురు పిల్లలూ రత్నాలు. ఇంత అందంగా ఉన్న, బాగా చదువుకున్న, సమర్థులయిన పిల్లలు మనవాళ్ళల్లో ఎంతమంది ఉన్నారని అనుకుంటున్నావు.. అదీ హైదరాబాద్‌లో. మన మహాలక్ష్మిని వచ్చి చూచి వెళ్ళిపోయే వాళ్ళందరూ అదృష్టం లేని వాళ్ళు. వాళ్ళు, వాళ్ళ తల్లిదండ్రులు వట్టిగాడిదలు. నీ పెళ్ళికి సుబ్రమణ్యం ఎంతకావాలన్నా ఇయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు. దానికి తగిన స్థోమతకూడ అతనికి ఉంది. కానీ నేను ఒక్క పైసా తీసుకోడానికయినా ఇష్టపడలేదు. అయినా కామాక్షి ఎన్నోవస్తువులు తెచ్చింది. మనం కూడ మనపిల్లలకు ఎంత ఇవ్వగలిగితే అంతఇస్తాము. ఇంత మంచి కుంటుంబంలో ఉన్న సాక్షాత్ మహాలక్ష్మి లాంటి మన మహాలక్ష్మిని చూడ్డానికి వచ్చి వద్దని చెప్పేవాళ్ళు జందెం వేసుకున్న గాడిదలు. మహాలక్ష్మి వివాహం జరగాలంటే ఏలినాటి శని పోవాలి. పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయంటారు కదా! ఆ సమయం వచ్చేటప్పటికి సద్బ్రాహ్మణ యువకులు వెదుక్కుంటూ వస్తారు. మన ముగ్గురు పిల్లల జాతకాలు మంచివే. రాజ్యలక్ష్మికి కుజదోషం ఉండడం వల్ల..కుజదోషం ఉండే జాతకుడే కావాలి. ఏమయినా, పెద్దమ్మాయి పెళ్ళయ్యాకే కదా రెండో అమ్మాయికి చెయ్యాలి. సీతాలక్ష్మికి యం.బి.బి.యస్. అయిపోవస్తున్నా ఇంకా హౌస్ సర్జన్సీ ఉంది కదా! అదయ్యేటప్పటికి ఎవరైనా మంచి డాక్టర్ వస్తాడు. కట్నం మనకులానికి భూషణం కాదు. చక్కగా పెంచుకున్న మన పిల్లల గురించి మనం బాధ పడనక్ఖరలేదు.'' అని అన్నాడు.

''కానీ నాన్నా! కాలం చాలామారింది. ఇప్పుడు కట్నంలేకుండ పెళ్ళి చేసుకోడానికి ఎవరూముందుకు రావడం లేదు. ఒకవేళ ఎవరైనా వచ్చినా అతని తల్లిదండ్రులు ఒప్పుకోరు. మనలాంటి శుద్ధశాకాహార బ్రాహ్మణ కుటుంబాలు హైదరాబాద్‌లో చాలా తక్కువ. అందుకే మన ముగ్గురు అమ్మాయిలకు కట్నం లేకుండ వివాహం జరగాలంటే తల్లిదండ్రులు లేని ముగురు బ్రాహ్మణ యువకులు రావాలి.... అలాంటి వారు ఉంటేనే అవుతుంది.

ఏమయినా ఇప్పుడు వాళ్ళడిగింది ఇచ్చి పెళ్ళి చేసే స్థోమతు మనకు లేదు కదా! అందుకే పుట్టిందగ్గర్నుంచీ చేస్తోన్న పూజ ఒక్కటే మన మనశ్శాంతికి మార్గం.'' అని తండ్రితో చెప్పాలని చాలాసార్లు అనిపించిందికాని ఒక్కసారికూడ దానికి ధైర్యం రాలేదు. డెభ్భయ్యారేళ్ళు దాటిన వెంకటేశ్వరన్ ఆరోగ్యం ఇప్పటికీ బాగానే ఉంది. కానీ ఏభైయ్యేళ్ళున్న వెంకట్రామన్‌కు తండ్రిలో సగం ఆరోగ్యం కూడ లేదు. అతను వెంకటేశ్వరన్ తమ్ముడని కొంతమంది అనుకున్నా ఆశ్చర్యం లేధు. అలాగే కొంతకాలం జరిగితే కొడుకు తండ్రికి అన్న అవుతాడేమో!

ముగ్గురు పిల్లలకు, అందునా అమ్మాయిలకు కాలేజీవరకు చదువు చెప్పించడం అంటే అంత సులభంకాదు, కామాక్షి ఇంటి నుంచి కొంచెం కొంచెం ఆర్థిక సహాయం లేకపోయుంటే ఇంతకాలం బతకడం కూడ కష్టం అయి ఉండేది. తండ్రి పింఛను, తండ్రి కట్టించిన ఇల్లు లేకుంటే తన 'ఓవర్ సైజు ఫామిలీని బతికించడం ఎలా అని ఆలోచించి...చాలామంచి వాడయిన తన తండ్రిని, అతిదయాళువు కాని దేవుణ్ణి తలచుకుని వారికి అతను మనసారా కృతజ్ఞత తెల్పేవాడు.

దాదాపు నలభైయ్యయిదేళ్ళు వచ్చేటప్పటికి వెంకట్రామన్‌ను మధుమేహం, రక్తపోటు అనే రోగాలు ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టాయి. దానివల్ల అతను చాలా క్షీణించి పోయాడు. ఆ విషయంలో కామాక్షి ఎంత దుఃఖించిందో దానికంటె ఎక్కువగా అతని తల్లిదండ్రులు బాధపడ్డారు. తండ్రి ఆరోగ్యం గురించి మహాలక్ష్మి, రాజ్యలక్ష్మి బాధ పడ్డా మూడో అమ్మాయి డాక్టర్ కావడం వల్ల ఆయనకు సరయిన మందులు, సలహాలు ఇవ్వడమే కాకుండ, ఆ కుటుంబ సభ్యుల కందరికీ ఆమె ధైర్యంకూడ చెప్పేది. ఇంగ్లీషు యం.ఏ. పాసయ్యే ముందే మహాలక్ష్మి ఇంట్లో కొంతమంది పిల్లలకు ట్యూషన్ చెప్పడం మొదలు పెట్టింది. ఆ రకంగా ఆమె తండ్రి వేణ్ణీళ్ళకు కొంచెం చన్నీళ్ళు కలిపేది. రసాయనిక శాస్త్రంలో మొదటి శ్రేణిలో యం.యస్‌సి పాసయిన రాజ్యలక్ష్మి గత సంవత్సరం నుంచి అనేక ప్రయివేట్ కళాశాలల్లో, పాఠశాలల్లో ఉద్యోగం సంపాదించడానికి ప్రయత్నాలు సాగిస్తూనే ఉంది. ఏదయినా ట్యుటోరియల్ కాలేజీలో ఆమె పాఠాలు చెప్తే బాగా డబ్బు వస్తుంది కానీ తాతదానికి అంగీకరించలేదు. అందుకే ఆమె కూడ ఇంట్లోనేట్యూషన్ మొదలు పెట్టింది. సీతాలక్ష్మి మెడికల్ కోర్సుకు ఖర్చులు ఎక్కువకావడం వల్ల వెంకట్రామన్‌కు చాలా అప్పులయ్యాయి. యం.బి.బి.యస్ కు ఆమెను పంపడం ఆయనకు శక్తి ఉండికాదు. కానీ యమ్ సెట్‌లో మంచి రాంక్ రావడమే కాక హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలోనే సీటు రావడం వల్ల; సీతాలక్ష్మిని ఎలాగయినా

యం.బి.బి.యస్ చదివించాలని ఆకుటుంబం అంతా ఏకగ్రీవంగా తీర్మానించడంవల్ల వెంకట్రామన్‌కు ఆమెను చదివించక తప్పలేదు. ఎంత దారిద్ర్య దుఃఖం ఉన్నా, తనకున్న ఒకేఒక చిన్న సరదా సినిమా చూడడమనే దాన్ని చంపుకోవలసి వచ్చినా భవిష్యత్తును చూస్తుంటే ఘోరాంధకారం మాత్రమే కళ్ళను కప్పుతున్నా తప్పుదారిలో ఒక్క పైసా సంపాదించడం అనే ఆలోచన కూడ అతని మనసులోకి రాలేదు. పి.ఎ.ఓ ఆఫీసులో ఉద్యోగం వస్తేనే లాటరీ కొట్టినట్లు అని అనుకుంటున్న ఈకాలంలో ఆ ఆఫీసులో పెద్ద ఉద్యోగంలో ఉన్న వెంకట్రామన్‌కు సహోద్యోగులు 'ఎండు గడ్డి మీద కూర్చున్న కుక్క' అని అంటుంటే వాళ్ళను తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఆ ఆఫీసులో పని చేసే వాళ్ళకు మాత్రమే కాక, కంట్రాక్టర్లు లాంటి వాళ్ళు ఎంతోమందికి. క్లైయిమ్ చేసిన మొత్తం ఒప్పయినా తప్పయినా ఆ ఆఫీస్ ద్వారానే బిల్లులు పాస్ కావాలి. అసంఖ్యాకులయిన దురాశాపరులకు తను కంటిలో నలుసు. మార్చినెలలో పిఏఓ ఆఫీసు ఒక పెద్ద సంతలా ఉంటుంది. అన్ని డిపార్టుమెంటుల నుంచి పైరవీకార్లు, బిల్లులు పాస్ చేయించుకోడానికి వచ్చే కంట్రాక్టర్లు బెల్లానికి ముసిరిన ఈగల్లాగ అక్కడ ఉంటారు.

వెంకట్రామన్ ఆ నెలలో ఒక గొప్ప విఐపి అయిపోతాడు చాలామంది అతని దగ్గరకు వచ్చి చాలావంగి నమస్కరించడం; అతను ముందెప్పుడు చూడనివాళ్ళు వందేళ్ళుగా మైత్రి ఉన్నట్లు తమ ద్వికర్ణ స్పర్శనార్థం తమ అధరాగ్రాల్ని లాగడం చూచి అతనికి నవ్వువచ్చేది. మామూలుగా చెయ్యవలసిన సహాయాలను చేసేవాడు. అందుకే ఆయనంటే చాలామందికి గౌరవం ఉండేది. అయితే, తప్పులు పట్టుకోడానికి కూడ అతను సమర్థుడే. అతను దొంగబిల్లుల్ని పాస్‌చెయ్యడం మాత్రం అసంభవం.

కామేశ్వరావు ఒక పెద్ద కాంట్రాక్టరు. అతను మెడికల్ డిపార్ట్‌మెంటుకు పెద్ద పెద్ద సప్లైస్ చేసేవాడు. ఈ సారి పదుకొండు లక్షల బిల్లు ఒకటి పిఏఓ ఆఫీసులో పడుకొని ఉండిపోయింది. ఆ బిల్లు కొన్ని అబ్జక్షన్లతో తప్పకుండా తిరిగి వస్తుందని కామేశ్వరావుకు భయంఉంది. అందుకే వెంకట్రామన్ గురించి అన్ని వివరాలూ క్షుణ్ణంగా సేకరించి, ఒకరోజు ఉదయం తొమ్మిదిన్నరకే ఆఫీసుకు వచ్చి నిలబడ్డాడు. ఆఫీసుకు రోజూ అరగంట ముందే రావడం, ఆఫీసుటైమయ్యాక కూడ రెండుగంటలెక్కువగా పనిచేయడం అలవాటు చేసుకున్న వెంకట్రామన్ ఆరోజుకూడ పదిగంటలకు ముందే వచ్చేశాడు. ఆఫీసుబైటనే అతన్ని పలకరించిన కామేశ్వర్రావు అతని వెంబడే గదికి వెళ్ళాడు. అతని బిల్లు విషయం చెప్తున్నపుడు వెంకట్రామన్ ఏ బిల్లునూ కావాలని ఆలస్యం చేయడంగాని, ఆపి పెట్టడంగాని తన అలవాటు కాదని అన్నాడు.

''కానీ స్వామీ! ఈకాలంలో ఏ ఆఫీసులో కూడ ఎకౌంట్స్ సరిగా తెలిసినవాళ్ళు లేరనే చెప్పాలి. వాళ్ళు బిల్లు తయారు చేస్తున్నపుడు... వాటిలో తప్పులుంటే వాళ్ళ సొమ్మేం పోయింది. పాపం! కంట్రాక్టర్‌నోటి దగ్గర తిండే కదా చెడేది? ఆ తప్పుల బిల్లుల్ని తయారు చేయాలన్నా మేమియ్యాల్సిన ముడుపుల్ని అడ్వాన్సుగా చెల్లించాల్సిందే. బిల్లు ఇక్కడికి వచ్చాక అయినా వాళ్ళు ఫాలో అప్ చెయ్యరు. దానికి కూడ మేమే తిరిగాలి. మేము లక్షలు పెట్టుబడి పెట్టి అన్నీ చేసి నెలలు గడిచాక బిల్లు పెట్టినా ఇక్కడ కూడ దానికి ఆలస్యం జరిగితే లేదా బిల్లు తిప్పి కొడితే మార్వాడీకి వడ్డీలు కట్టలేక ఎలా ఛస్తున్నామో స్వామికి తెలుసా?'' అని బట్టీ పట్టిన పాఠాన్ని అప్ప జెప్పున్నట్లు అతి వినయంతో పాపం ఆ కంట్రాక్టర్ విన్నవించుకున్నాడు.

చిరునవ్వుతో వెంకట్రామన్ ఆయన బాధను అర్థంచేసుకున్నట్లు తల ఊపాడు. ఆ 'తల ఊపుడు' చివరి ఘట్టలో ఒకసారి విసురుగా తల విదిలించాడు. దానికి కారణం వేరే ఏమీ కాదు. హైదరాబాద్‌లో అన్ని చోట్లా ఉన్నట్లు ఆ ఆఫీసులో కూడ దోమల బాధ ఉంది. అది ఆఫీసు కావడం వల్ల పగలే దోమల బాధ ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడే ఉండి పోవడానికి అవి అంత బుద్ధిలేని కీటకాలు కావు లంచాలు తినీ, తినిపించి పగలయితే బాగా కండపట్టిన మనుషుల రక్తం 'తెలుగు గంగ' మాదిరి పుష్కలంగా దొరుకుతుందని వాటికీ తెలుసు. ఏమయినా, స్వామి కర్ణపుటాలదగ్గర కఠోర నాగస్వరం వాయిస్తున్న ఆ రక్త పిపాసిని కామేశ్వర్రావు రెండు చేతులతో వేటాడి హతమార్చాడు. తన చేతుల్లో చపాతీ అయిపోయిన ఆ కృశగాత్రినిని అప్పుడే కొత్తగా ఉద్యోగంలో చేరిన కాన్స్టేబుల్‌మొదటిసారిగా ఒక దొంగనుదొంగసరుకుతో పట్టి సబిన్స్పెక్టర్ సమక్షంలో పెట్టినట్లు, స్వామి సంతోషం కోసం ప్రదర్శించాడు. తన చెవిదగ్గర అతను రెండు చేతులతో కొడుతున్నపుడు ఇతను లేచి నన్ను కొడుతున్నాడెందుకు? అని రెండుక్షణాలు జడిసి పొయ్యాడు. మరుక్షణం అతను తనను కొట్టినట్లు ఎవరయినా అనుకుంటారేమోనని అతని స్పందన లేపీ బైటికి కన్పించకుండా తలుపువైపు చూశాడు.

''ఈ ఆఫీస్‌లో మీకు అన్యాయమేమీ జరగదు. మీరు నన్ను చూచి చెప్పినా, చెప్పకున్నా మీబిల్లులో పెద్దతప్పులేమీ లేకపోతే అది పాసవుతుంది.'' అని వెంకట్రామన్ శాంత, గంభీర స్వరంతో అతనికి హామీ ఇచ్చాడు. ''కానీ స్వామీ!'' ఈ ఆఫీసులో అన్యాయమే జరగదు అని తమరు చెప్పడం తమ మంచి మనసు వల్లే...పోలీసు డిపార్ట్‌మెంట్‌వాళ్ళుకూడా ఇక్కడికి వచ్చేటప్పటికి పిల్లులవుతారు. వాళ్ళు కూడ కొంచెం పర్సెంటేజి మామూలుగా ఇస్తూంటారు. తమలాంటి వాళ్ళు న్యాయస్థానాల్లోగాని, అవినీతి నిరోధకశాఖలోగాని

ఉండాలి. స్వామికి ఈ ఆఫీసు అనుగుణమయింది కాదు. తమరనుకున్నట్లు కూడ ఈ ఆఫీసునడవదు. సముద్రంలో ఒక పాల చుక్క పడితే అది క్షీరసాగరమవుతుందా స్వామీ!''

అని ఆ కంట్రాక్టర్ ఒక పరమ సత్యాంతో పరమ వేదాంతంలో అడుగుపెడ్తున్నపుడు ఆ సుదీర్ఘ భాషణశ్రవణానికి తాను సిద్ధంగా లేనని కచ్చితంగా చెప్పకుండా ''నేను నాగురించే చెప్పాను. ఇతరుల విషయాల్లో నేను కల్పించుకోను'' అని చెప్తూ తన బల్లమీద ఉన్న ఫైల్సును చేతుల్లోకి తీసుకున్నాడు.

''స్వామి నన్ను అపార్థం చేసుకోకపోతే కొన్ని విషయాలు స్పష్టంగా చెప్పాలని ఉంది.''

''చెప్పండి....చెప్పండి....ఏది చెప్పడానికయినా మీరు సంకోచించ పనిలేదు....కానీ నాకు ఏదయినా నచ్చక పోతే నేను కూడ దాన్ని స్పష్టంగానే చెప్తాను.''

స్వామీ! ఈ ఆఫీసులో ఉద్యోగం దొరకడమే ప్రభుత్వానికి ఇల్లరికపు అల్లుడవడం అని చాలామంది అనుకుంటారు. ఇక్కడ పనిచేసే వారికెవరికయినా ఉబ్బుకు ఇబ్బంది ఉండదు. కానీ తమరికి ఎన్ని బాధలున్నాయో నాకుతెలుసు. సత్యసంధుడయిన హరిశ్చంద్రుడికి ఆనాడు స్మశానం కాపలా దొరికితే ఈ నాటి సత్యసంధులకు పస్తులు మిగులుతాయి అని అంటే దానిలో అతిశయోక్తి ఏమీలేదు. 'బాంకు స్కాం'లో ఐదువేల కోట్లు పోయినా బైటికిరాని ఈ దేశంలో, ఒక సంవత్సరం అంతా కష్టపడి పనిచేసే ఐ.ఎ.యస్., ఐ.పి.యస్ ఆఫీసర్ల వంటివారికి కూడా వచ్చే మొత్తం ఒక లక్ష లేక ఒకటిన్నర లక్ష. దానిలో ఒక ముప్పయి లేదా ముప్పయ్య యిదువేలు ఇన్‌కంటాక్స్‌గా తిరిగి కట్టాలి. ముప్పయ్యయిదు, ముప్పయ్యారు సంవత్సరాలు పనిచేశాక కూడ పది లక్షల ఖరీదు చేసే ఒక చిన్న ఇంటికిగాని, రెండు లక్షల ఖరీదు చేసే ఒక కారు కొనడానికిగాని వారికి 'సేవింగ్స్' ఉంటాయా? ఇక్కడ కొందరు పాన్‌షాప్ వాళ్ళుకూడా నెలకు యాభైవేలు సంపాదిస్తున్నారు. ఇంత పెద్ద పెద్ద పరీక్షలుపాసై పెద్ద ఉద్యోగాలు సంపాదించి ఎందుకు వీళ్ళు అర్ధాకలితో బతుకుతున్నారు. అయితే, బతకటమెలాగో తెలుసుకున్న పొలిటికల్ టైప్ ఆఫీసర్లకు సుఖపడడానికి వచ్చిపడుతున్న డబ్బుకు టాక్సులే లేవు.''

''అదంతా సరే మిస్టర్! సత్యసంధత ఉంటే అది మనస్సుకు చల్లదనాన్నిస్తుంది. మనశ్శాంతిని లక్షలిచ్చి కొనుక్కోలేం. దానికోసం పస్తులున్నా... ఈజిట్ నాట్ వర్త్ ఇట్?''

''కానీ నా బంగారు స్వామీ! మనుషుల దుఃఖాల్లో అత్యంత దుస్సహమయింది పుత్రదుఃఖం. ఎంతో పెద్ద మహారాజయిన దశరథుడు కూడా పుత్రదుఃఖంతోనే

మరణించాడు. మానవునికి మరో మహాదుఃఖం సంతానరాహిత్యం. కానీ అన్నిటికి మించిన ఘోర దుఃఖం దారిద్ర్య దుఃఖం అని బీదవాళ్ళు అంటారు. కానీ తల్లిదండ్రులకు అనంత దుఃఖ కారకమయింది ఎదిగిన ఆడపిల్లలు ఇంట్లో ఉండడం. అలాంటి దుఃఖం తమకు మూడురెట్లు అని నాకు తెలుసు. ఈ కాలంలో డబ్బు ఖర్చుపెట్టాల్సిన చోట పెట్టక తప్పదు. డబ్బుకు బదులుగా మంచి తనం నిలవదు. ఎంత తక్కువ ఖర్చు అని అనుకున్నా ఒక్కొక్క పెళ్ళికి ఎంత ఖర్చవుతుందో అందరికీ తెలుసు.''

''అదంతా కర్మక్షే కామేశ్వర్రావ్... కానీ మనం దీన్ని చర్చించాల్సిన స్థలం ఇది కాదు. మీ బిల్లు వచ్చినపుడు నేను త్వరగానే చూస్తాను.''

''సార్! నా బిల్లు ఇక్కడే ఉంది... దానిలో కొర్రీలేం పడకుండా స్వామి చూడకపోతే నాకు చాలా పెద్ద నష్టం కలుగుతుంది.''

''నేను చెప్పానుగదా! బిల్లు ఒకమాదిరి సరిగ్గా ఉంటే నేను తిప్పి పంపను. కానీ పెద్ద తప్పులుంటే పంపించకుండా ఉండను.''

''స్వామీ! ఈ ఒక్కసారి నన్ను కాపాడకపోతే నేను బతకను.'

''చూడు మిస్టర్! ఇక్కడ నేను ప్రభుత్వం కోసం పనిచేస్తున్నాను. ఎవరికి సహాయం చేయడానికయినా నేను ప్రభుత్వానికి ద్రోహం చెయ్యను.''

''సార్! నా బిల్లులో ఎవరయినా తప్పులు రాసి ఉంటే వాళ్ళకేం నష్టం జరగదు. నష్టమంతా నాది. తమరింట్లో సమస్యలున్నట్లే నా ఇంట్లోకూడ సమస్యలున్నాయి. ఈ కష్టస్థితిలో - నాకు మీరు సాయం చేస్తే నేను మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. తమరు నన్ను వేరుగా చూడవద్దు. నేనెప్పుడూ తమరి సొంతమనిషిగా ఉంటాను. స్వామికి ఎప్పుడు ఏ సహాయం చేయడానికయినా నేను సిద్ధంగా ఉంటాను.''

''మిస్టర్ కామేశ్వర్రావ్! బిల్లు పాసయేముందు అందరూ ఇలాగే మాట్లాడతారు. కార్యం సాధించిన తరవాత ఎవరూ ఇటు తిరిగే చూడరు. కానీ అలాంటిదేం ఉద్దేశించి కాదు నేను పనిచేసేది... నేను నా ధర్మం నిర్వర్తిస్తాను.''

''అయ్యో! స్వామీ! నేనెప్పుడూ మీ శ్రేయోభిలాషిగానే ఉంటాను.''

''ఈ బిల్లు ఇప్పుడు పాస్ కాకపోయినా కూడానా?''

''స్వామీ! అలాంటి అపశకునం మాట్లాడొద్దు. ఇది నా జీవన్మరణ సమస్య. దీన్ని పాస్ చేసి చూడండి. వెంటనే మీకు ప్రయోజనం తెలుస్తుంది... దయచేసి తమరు అంగీకరిస్తే...''

''మీరెంతవరకు సహాయం చెయ్యగలరు?'' ఆ ప్రశ్న వినగానే కామేశ్వర్రావు ముఖంలో ఒక కొత్తమెరుపు వచ్చింది. అతనిలో నవోన్మేషం పుట్టింది. అతను తన కుర్చీని బల్లకు దగ్గరగా లాక్కుని ''ఫైవ్ పర్సెంట్'' ఖర్చు పెట్టడం నాకు సంతోషమే'' అన్నాడు.

''అంటే... దాదాపు యాభైయ్యయిదు వేలవరకు కదా!''

''అవునండీ!''

''దాంతో నా సమస్యలు తీరుతాయా కామేశ్వర్రావ్?'' దానికి నాలుగురెట్లు నాకు అప్పులే ఉన్నాయి.''

''లేకపోతే ఇంకొకటి లేక రెండు వరకూ...''

''అది నాకొక లాటరీ అవుతుందా? నా సొంతం అని చెప్పుకోడానికి ఒక ఇల్లు కూడా లేదు...''

''అయితే స్వామీ! ఎంతవరకు సజెస్ట్ చేస్తున్నారు?''

''ఫిఫ్టీ పర్సెంట్ చేస్తే దానికి అర్థం ఉంది...''

కామేశ్వర్రావు నోరు తెరుచుకుని అలాగే ఉండిపోయింది. తాను సరీగ్గా విన్నాడా లేదా అని అతనికి అనుమానం, ఆశ్చర్యం ఒకేసారి కలిగాయి. ఇంకా ఏం చెప్పాలో తోచలేదు.

అతని ''కిం కర్తవ్యతా మూఢస్థితి''ని గుర్తించిన వెంకట్రామన్ మందహాసంతో ''మీ ముఖం చూస్తే ఫిఫ్టీ పర్సెంట్ ఇచ్చేసినట్లే ఉందే?... ఇప్పుడే ఇంత నిస్సత్తువ వస్తే ఎప్పటికీ నామనిషిగా ఉండి నాకు కావలసిన సహాయాలన్నీ ఎలా చేస్తారు?... భయపడకండి... భయపడకండి... నేను లంచం తీసుకోనని మీకు బాగా తెలుసుకదా! మీ రియాక్షన్ చూద్దామని ఊరికే అన్నాను... నాకు, నా పిల్లలకు ఏం సంభవించినా ఫరవాలేదు... అదంతా దైవ సంకల్పం అనే నేను అనుకుంటాను. నా ఇంటి పరిస్థితులు ఏమయినా లంచం పుచ్చుకోడానికి అవి నన్ను ప్రేరేపించవు. ఏ కారణం కూడా ఆహీన ప్రవృత్తిని సమర్థించదు. ఇంతవరకు ఏమచ్చాలేని నా విధి నిర్వహణారంగాన్ని పంకిలం కానీయకుండా నేను ముందుకు పోతాను.''

అనుకోకుండా తగిలిన ఆ షాక్ నుంచి విముక్తుడైన కామేశ్వర్రావు ''స్వామీ! ఈ బిల్లు మీ టేబుల్ దాకా రావడానికి ఎన్ని దశల్లో, ఎంతమందికి ఎన్ని పర్సెంటేజీలు ఇచ్చానో చెప్తే మీరు నమ్మరు... అవన్నీ అయ్యాక ఇంకా యాభైశాతం దాన్ని పాస్ చేయించుకోడానికి ఖర్చు పెట్టాలంటే దూకి చావడం దానికంటే మేలు. అందుకే నేను కొంచెం షాక్ తిన్నాను.

కానీ తమకు నాశక్తి కొద్దీ సాయం చెయ్యాలన్న కోరికను అవాస్తవం అని తమరనుకోకూడదు. ఎంతోమంది పెద్దవాళ్ళకు నేను డబ్బిచ్చాను. అది సంతోషంగా ఇచ్చుకున్నది కాదు. వాళ్ళు నానుంచి లాక్కున్నారు. వాళ్ళను శపిస్తూ దాన్ని ధారబోశాను. కానీ తమరికి ఎంత సహాయం చేస్తే అంత ఆత్మసంతృప్తి నాకు కలుగుతుంది... ఒక మంచి పని చేసిన తృప్తి...''

''మీరలా తృప్తి పొందితే నేను ఏ అగాధానికి, ఏ పాతాళానికి అధఃపతనం చెందుతానో మీకు తెలుసా? దాదాపు ముప్పయి సంవత్సరాల వరకు పవిత్రంగా పరిరక్షించుకున్న నా ఉద్యోగ ధర్మశీలాన్ని మిగిలిన కేవలం ఏడు సంవత్సరాలలో అపవిత్రం చేసే ఉద్దేశం నాకులేదు... అయితే మీరు చెప్పేది కూడా రైటే. కల్యాణ ప్రాయం దాటిన ముగ్గురు అమ్మాయిలు ఇంట్లో ప్రశ్నలు గానే ఉన్నారు. వాళ్ళ స్నేహితులురాళ్ళల్లో ఎక్కువమందికి పెళ్ళిళ్ళయి పిల్లలు కూడా పుట్టారు. అవన్నీ ఆలోచిస్తే నాకు తల తిరుగుతుంది. కానీ ఆ దేవుడిమీద అచంచల విశ్వాసం పెట్టుకొని నేను ముందుకు వెళ్తున్నాను.''

''కానీ స్వామీ! అమ్మాయిల వయసుకూడ ముందుకే కదా వెళ్తోంది. ఇది కలియుగం. స్వామీ కలియుగం! స్వామీ! మీ సహాయార్థం దేవుడు ఏరూపంలో అవతరించాలి? తమ బాధలు ఎలా తీరతాయనుకుంటున్నారు?''

''ఏమయినాసరే... నేను మాత్రం లంచం తీసుకోను. నా కుటుంబం దైన్య స్థితి మీకు అంత కరుణ కలిగిస్తే, నా బాధలు పరిష్కరించాలని మీకు నిజంగా కోరిక ఉంటే... అయినా కూడా నేను ఒక్కపైసా తీసుకోను... కలియుగ దేవుడిగా మీరే అవతరించి నాకుటుంబ భారాన్ని మీరే స్వీకరించండి... నా పిల్లల పెళ్ళిళ్ళు మీరే జరిపించండి. వాళ్ళకి ఇల్లు కావాలంటే దాన్నికూడా మీరే కట్టించి ఇయ్యండి. నా ఉద్యోగంతో 'రోటీ, కపడా' లకే కష్టంగా ఉంది. 'మకాన్' ఆలోచనలోకి రావడానికే సాధ్యం కాదు... వాళ్ళకు కావలసిన నగలు, కంచిపట్టు చీరలు... అన్నీ మీరేకొని పెట్టండి. వాళ్ళకు భర్తల్ని కొనడానికి కావలసిన కట్నం కూడ మీరే ఇచ్చేయండి. పెళ్ళిళ్ళకు ఎంతమందిని ఆహ్వానించి మృష్టాన్న భోజనం పెట్టాలో మీరే నిర్ణయించండి... నాకు మీది... పైసా వద్దు. నా కుటుంబానికి కూడా మీది పైసా అవసరం లేదు. మా కుటుంబాన్ని మీరు ఉద్ధరిస్తే మీరే కలియుగ అవతారమని మేము పూజిస్తాము... నా కుటుంబ భారాన్ని మీరు తీసుకోండి... నా పిల్లలకు మంచి భవిష్యత్తు నియ్యండి. నేను మోయలేని కుటుంబ భారాన్నుంచి నాకు విముక్తి ప్రసాదించండి... నాకు కావలసింది ముష్టికాదు... ముక్తి... అది మీ పర్సంటేజివల్ల కొంచెమైనా దొరుకుతుందా?'' అదే సమయంలో ఆ గదిలోకి ఎవరో రావడంవల్ల, ఆ

ప్రశ్నకు సమాధానం ఏం చెప్పాలా అని ధర్మసంకటంలో పడ్డ కామేశ్వర్రావు టెంపరరీగా దాన్నుంచి తప్పించుకున్నాడు.

తిరిగి ఇంటికి వెళ్తున్నప్పుడు కారులో కూర్చొని అదే సమస్య గురించి చాలా దీర్ఘంగా ఆలోచించాడు. తన బిల్లు గురించి వెంకట్రామన్ కొంచెం కూడ కమిట్ అవలేదు. ఆయన చెప్పిందంతా చమత్కారంగా అనిపించినా అందులో గంభీరమైన అర్థం ఉంది. ఆయన నిజాయితీపరుడు. అందువల్ల తన ఉద్యోగంతో వ్యాపారం చెయ్యాలన్న ఆలోచనే లేదు. లంచం పుచ్చుకొనే అలవాటతనికి ఉంటే ఈ రోజు ఈ దీనస్థితిలో ఉండేవాడు కాదు. అలా ఉంటే ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళు ఒకళ్ళ తరవాత ఒకళ్ళకి ఈపాటికి చేసి ఉండేవాడు. ఆఫ్టరాల్ వాళ్ళు బ్రాహ్మలే కదా! ఒక్కో పెళ్ళికి మహా అయితే ఒక యాభైవేలు లేదా లక్ష అవుతుంది. కానీ... పాపం ఆయనకు పిల్లలకు ఒక్కొక్కళ్ళకు, ఒక్కొక్క ఇల్లయినా ఇవ్వాలని ఉంది. తనకు వచ్చే తండ్రి ఇల్లు ఒకమ్మాయికి ఉంటుంది అనుకున్నా, మిగిలిన ఇద్దరికీ కొనిగాని, కట్టించిగాని ఒక్కొక్క ఇల్లు ఇయ్యాలని ఆయనకు పెద్ద అభిలాష ఉంది. దానికి దాదాపు పది లక్షలవుతుంది. అందుకే... ఆయనకు ఒక 15 లక్షల లాటరీ తగిలితే... తానే మొత్తం ప్రపంచంలో మహాభాగ్యవంతుణ్ణే అనుకుంటాడేమో... ఆయన కొంచెం తలుచుకుంటే రెండుమూడు సంవత్సరాల్లో ఈ మొత్తాన్ని సునాయాసంగా సంపాదించగలడు... కానీ ఏం చేయాలి? ఈ విషయంలో స్వామి ఒక గాడిద అయిపొయ్యాడు కదా! ఈ రోజుకు కూడ ఆయన హరిశ్చంద్రుని వారసునిలా ప్రవర్తిస్తే ఆయనకు లభించేది హరిశ్చంద్రునిలాగా స్మశానమే. అతనికి స్వయంగా లంచంగా తీసుకోడానికి భయం ఉంటే... దానికి ఒక ఏజన్సీ తీసుకుని ఆయనకు కావలసిన పనులు చేసి పెట్టడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కానీ ఈ విషయం ఆయనకు అర్థం అయ్యేలా ఎవరు చెప్పగలరు? దానికి ఆధునిక శంకరాచార్య అవతరించాలేమో ఇప్పటికయినా ఆయనకు సద్బుద్ధి కలగకపోతే ఆయన సత్యసంధత అనే శిలువమీద బలి అయ్యేది ఆ ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్తే. పెద్దమ్మాయికి ఇరవై అయిదు దాటినట్టుంది.

స్వామి విషయం మొత్తానికి ఇంతే. నా సమస్యలతో పోలిస్తే అవేపాటి. పాపం స్వామికి నాగురించి ఏమీ తెలియదుకదా! మా పెద్దమ్మాయి పెళ్ళికి అరవయ్యయిదు లక్షలయింది. పెద్ద అల్లుడు ప్రయివేట్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ఇంక మిగిలిన నలుగురాడపిల్లలకు ఇంజనీర్లను గాని, డాక్టర్లను గాని కొనాలంటే దాదాపు మూడుకోట్లు కావాలి. ఇద్దరు పిల్లలకు రెండు సంవత్సరాలలోపునే చేయాలి. తరవాత పిల్లలకు ఇంకో అయిదు సంవత్సరాల గడువుంది. తన పంచవర్ష ప్రణాళిక అంచనా కనీసం మూడుకోట్లు. ఇదంతా తానెలా సంపాదించాలి? ఇంపాసిబుల్... ఎక్కువ ఆలస్యం చెయ్యకుండా ఎలక్షన్‌లో

గెలిచి మంత్రి అయితే!! ఏ పోర్ట్‌ఫోలియో అయినా ఫరవాలేదు. తన లక్ష్యాన్ని ఒక సంవత్సరం లోపల సాధించవచ్చు. అంత ఆత్మవిశ్వాసం తనకుంది.

కానీ దేనికీ పనికి రాని పరిస్థితి తనది...

కామేశ్వర్రావు తనను తాను శపించుకున్నాడు. తాను 'కమ్మ' కులంలో ఎందుకుపుట్టాడు? అందుకే కదా! ఇంత ఎక్కువ కట్నం ఇవ్వాల్సి వస్తోంది! అదే... నాకు పంచపుత్రికలు కాకుండ పంచపాండవులు పుట్టి ఉంటే 'పంచ నక్షత్ర' స్టైల్‌లో బతికి ఉండొచ్చు. ఏమయినా, ఈ నక్షత్రాలు, గ్రహాలు కారణంగానే తనకు, స్వామికి ఈ కష్ట పరిస్థితి ఏర్పడింది. కానీ స్వామి కులంలో తాను పుట్టి ఉంటే తన సొంత బుద్ధిబలంతో ఎంత గొప్పవాడయ్యేవాడు!

ఆ సమయంలో కామేశ్వర్రావుకు తన మిత్రుడైన అప్పారావు మాటలు గుర్తుకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో పుడితే బ్రాహ్మడిగా గాని, కమ్మగా గాని పుట్టకూడదు. ఒక ఐ.ఏ.యస్., గాని ఒక ఐ.పి.యస్‌గాని కావలంటే ఒకరెడ్డి కొండరెడ్డిగా, ఒక కాపు కావాలంటే కొండకాపుగా ఈజీగా రిజర్వేషన్‌లో రావచ్చు. అది కమ్మవారికి, బ్రాహ్మణులకు సాధ్యం కాదు కదా!

ఇలా ఆలోచిస్తున్న కామేశ్వర్రావు తలలో ఒక మెరుపు మెరిసింది. ఒకటి రెండు సంవత్సరాలలో డబ్బు సమకూడే అవకాశం లేదంటే మతం మార్చుకుంటే ఎలా ఉంటుంది? క్రైస్తవ మతమయితే అల్లుళ్ళు ఇంకా కొంచెం చౌకగానే దొరుకుతారు? చర్చికి పోవాలన్న కఠిన నియమమేం లేదు. పైగా కావాలంటే గుడికి కూడా పోతూ ఉండవచ్చు.

''మతం ఏదయినా మానవుణ్ణి మంచివాణ్ణిగా చేయాలి.'' అత్యాధునిక రాజకీయ పోకడల దృష్ట్యా హుస్సేన్‌సాగర్ జలాశయం మధ్య ఒంటరిగా నిలుచున్న శ్రీ బుద్ధ భగవానుల మతాన్ని స్వీకరించడం ఎక్కువ లాభకరం కాదా అన్న ఐడియా వచ్చింది. బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ ద్వారానే కాకుండా ఆంధ్రదేశం అంతటా నిక్షిప్తమైన బౌద్ధ క్షేత్రాలలోని అవశిష్టాలను వెలికితీసి, ప్రచారం చేసి బుద్ధుణ్ణి కులాతీత, మతాతీత దేవుడిగా మళ్ళీ అవతరింపజేసి తానొక గొప్ప నాయకుడైపోకూడదా? పాత రాజకీయ పార్టీలలో స్థానం సంపాదించడం చాలా ఇబ్బందికరంగా ఉన్నపుడు కొత్తపార్టీ స్థాపించడమే అన్నివిధాలా శ్రేయస్కరం అని కూడా అతనికి అనిపించింది.

బుద్ధం శరణం గచ్ఛామి - సంఘం శరణం గచ్ఛామి - ధర్మం శరణం గచ్ఛామి

ఆఖరి వరసలో ఉన్న 'ధర్మం' అన్న పదంలో ధర్మపత్ని అనే హైకమాండ్ విషయం ఒక ఐదువందల వాట్ బల్బు వెలిగినట్లు మనసులో స్ఫురించింది. ఆమెనడగకుండా ఈరోజు స్నానం చేయాలా వద్దా అన్న ముఖ్య విషయంలోనయినా ఒక తీర్మానాన్ని స్వయంగా తీసుకోలేని సత్వ్యభావి అయిన పురుషుడు కావడంవల్ల కారును స్పీడుగా పోనీయమని డ్రైవర్‌ని ఆదేశించాడు.